పెండింగ్ పనులను పూర్తి చేయాలి

నిజాంపేట్, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): నిజాంపేట్ కార్పొరేషన్‌లోని డివిజన్లలో పెండింగ్ పనులను త్వరగా పూర్తి చేయాలని మేయర్ కొలన్ నీలారెడ్డి అధికారులను ఆదేశించారు. మంగళవారం కార్పొరేషన్ కార్యాలయంలో కమిషనర్ రామకృష్ణారావు, ఎస్ఈ సత్యనారాయణతో కలిసి పలు విభాల అధికారులతో పెండింగ్ పనులు, కొనసాగుతున్న అభివృద్ధి, ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించే అంశాలపై మేయర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రజా సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో పనిచేయాలని, పెండింగ్ దశలో ఉన్న అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. 33 డివిజన్ల శానిటేషన్ సూపర్ వైజర్లతో మేయర్ మాట్లాడుతూ ఆయా డివిజన్ల పరిధిలోని అపార్టుమెంట్లు, విల్లాలు, కాలనీలు, బస్తీలు ఎప్పటి కప్పుడు శుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో కార్పొరేషన్‌కు చెందిన పలు విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



అధికారులతో సమావేశమైన మేయర్ కొలన్ నీలారెడ్డి

పారిశుధ్య నిర్వహణపై మేయర్ దృష్టికి

మియాపూర్, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): జీహెచ్ఎంసీ కౌన్సిల్‌హాల్‌లో జరిగిన బల్దియా సమావేశంలో మియాపూర్ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ పారిశుధ్య నిర్వహణపై మేయర్ దృష్టికి తీసుకెళ్లారు. మాదాపూర్ డివిజన్, హఫీజ్‌పేట్, చందానగర్, మియాపూర్ డివిజన్‌లో శానిటేషన్ పారిశుధ్య నిర్వహణ సరిగా లేదని, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, మియాపూర్‌లోని డంపింగ్‌యార్డులో కెమికల్, మెడికల్, ప్లాస్టిక్ వ్యర్థాలు డంపింగ్ చేస్తున్నారని విన్నవించారు. దీంతో పరిసర కాలనీ వాసులు దుర్వాసనలతో ఇళ్లలో ఉండలేని పరిస్థితి నెలకొందని, సమస్య పరిష్కరించాలని ఆయన మేయర్‌ను కోరారు.

పదేళ్ల నుంచి అద్దె చెల్లించకుండా.. బలవంతంగా ఖాళీ చేయించారంటే ఎలా?

- ఎంఎస్ఎంఈ ఉమెన్ ఎంటర్‌ప్రెన్యూర్ పిటిషన్‌లో జోక్యానికి హైకోర్టు నిరాకరణ

హైదరాబాద్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): పదేళ్ల నుంచి అద్దె చెల్లించకుండా.. 2014లో లీజు గడువు ముగిసినా ఇంకా అక్కడే కొనసాగుతూ బలవంతంగా ఖాళీ చేయించారంటే ఎలా అని ఎంఎస్ఎంఈ ఉమెన్ ఎంటర్‌ప్రెన్యూర్ అసోసియేషన్, ఆ సంస్థ డైరెక్టర్ దూడ సురేశ్‌కుమార్‌ను హైకోర్టు ప్రశ్నించింది. ఆ సంస్థ దాఖలు చేసిన పిటిషన్‌లో జోక్యానికి నిరాకరించింది. ప్రభుత్వరంగ సంస్థ అయిన తెలంగాణ స్టేట్ టెక్స్‌టైల్స్ కాంప్లెక్స్ కోఆపరేటివ్ సొసైటీ నాంపల్లి చేనేత భవన్‌కు చెందిన 9200 చదరపు అడుగుల కాంప్లెక్స్ స్థలాన్ని ఎంఎస్ఎంఈ ఉమెన్ ఎంటర్‌ప్రెన్యూర్ అసోసియేషన్ లీజుకు తీసుకుంది. 2011 డిసెంబర్ 20న లీజుకు తీసుకోగా 2014 డిసెంబర్ 19తో గడువు ముగిసింది. గడువు ముగిసినా పిటిషనర్ సంస్థ అక్కడే కొనసాగుతూ రూ.49.78 లక్షల అద్దె బకాయిలు పడింది. తాజాగా తమకు ఎలాంటి సమాచారం, నోటీసు ఇవ్వకుండా చట్టబద్ధమైన ప్రక్రియ పాటించకుండా తాళాలు పగలగొట్టి అక్రమంగా విలువైన సామగ్రి తీసుకెళ్లారని.. తప్పుడు ఆరోపణలతో క్రిమినల్ కేసు పెట్టారని.. సహజ న్యాయ సూత్రాలకు, రెంట్ కంట్రోల్ యాక్ట్‌కు విరుద్ధంగా ప్రతివాదులు వ్యవహరించారని పేర్కొంటూ పిటిషనర్ హైకోర్టును ఆశ్రయించారు. ఇది ఒప్పంద ఉల్లంఘనకు సంబంధించిన వివాదమైన నేపథ్యంలో ఇందులో జోక్యం చేసుకోవాలని పేర్కొంటూ సింగిల్ జడ్జి పిటిషన్‌ను కొట్టేశారు. దీంతో పిటిషనర్‌లు డివిజన్ బెంచ్‌లో అప్పీల్ దాఖలు చేశారు. ఈ అప్పీల్‌పై చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ అనిల్‌కుమార్ ధర్మాసనం మంగళవారం విచారణ చేపట్టింది. వాదనలు విన్న ధర్మాసనం.. అప్పీలుదారులు వివాదంలో ఉన్న లీజుభవనం యజమానులు కాదని.. 2012 నుంచి 2022 వరకు అద్దె చెల్లించకపోవడంతో రూ.49.78 లక్షల బకాయిలు ఉన్నాయని పేర్కొంది. లీజు గడువు సైతం చాలాకాలం కిందే ముగిసినా.. ఒప్పందం పునరుద్ధరించకపోయినా.. అద్దె చెల్లించకుండా అక్కడే ఉంటున్నారని వ్యాఖ్యానించింది. ఒక ప్రభుత్వ సంస్థకు అద్దె చెల్లించకుండా కొనసాగుతున్న పిటిషనర్ ఎలాంటి ఉపశమనానికి అర్హులు కారని పేర్కొంది. ఈ మేరకు సింగిల్ జడ్జి తీర్పును సమర్థిస్తూ తుది ఆదేశాలు జారీచేసింది.

రైతులను మోసం చేసిన బీజేపీ: జస్టిస్ చంద్రకుమార్



సమావేశంలో మాట్లాడుతున్న జస్టిస్ చంద్రకుమార్

పంజాగుట్ట, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): రైతు పండించిన పంటకు కనీస మద్దతు ధర ఇస్తామని 2014 ఎన్నికల్లో బీజేపీ మేనిఫెస్టోలో పేర్కొని రైతులను మోసం చేసిందని, పదేళ్ల అధికారంలో ఉన్నా రైతుల డిమాండ్లను పట్టించుకోకుండా వారి ఉద్యమాన్ని అణచివేయడానికి క్రూరమైన పద్ధతులు అమలు చేస్తోందని పలువురు వక్తలు ఆరోపించారు. మోదీ పదేళ్ల పాలనలో 7.50 లక్షల మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారని, బడా కార్పొరేట్ సంస్థలకు 14 లక్షల కోట్ల రుణాలు మాఫీ చేశారని వారు ఆరోపించారు. తెలంగాణ రైతు సంక్షేమ సమితి ఆధ్వర్యంలో మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో పంటలకు కనీస మద్దతు ధర ఇవ్వాలని డిమాండ్ చేస్తూ పంజాబ్ రైతుల పోరాటానికి సంఘీభావం తెలుపుతూ సమితి అధ్యక్షుడు ఓర్సు ఇంద్రసేన అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు జస్టిస్ చంద్రకుమార్ మాట్లాడుతూ రైతు పంటను మార్కెట్‌కు తెచ్చినప్పుడు దళారులు, వ్యాపారులు ధరలు తగ్గించి దోచుకుంటున్నారని ఆరోపించారు. ప్రభుత్వాలు వ్యవసాయ రంగాన్ని నాశనం చేస్తున్నాయన్నారు. సమావేశంలో తెలంగాణ విద్యావంతుల వేదిక అధ్యక్షుడు జి.రవీందర్, తెలంగాణ సమాఖ్య అధ్యక్షుడు కరుణాకర్ దేశాయ్, వివిధ సంఘాల ప్రతినిధులు నైనాల గోవర్ధన్, సొగరా బేగం, అంబు రాథోడ్, ప్రొఫెసర్ పద్మజా షా, పృథ్వీరాజ్ యాదవ్, కామేశ్వర్ రావు, పాశం యాదగిరి పాల్గొన్నారు.

నిందితులు చట్టసభలకు వెళ్లకుండా చూడాలి



రాష్ట్రపతి, ప్రధానికి పంపిన లేఖను ప్రదర్శిస్తున్న ఫోరం ఫర్ డెమోక్రసి అండ్ గ్లోబల్ పీస్ సంస్థ ప్రతినిధులు

పంజాగుట్ట, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): నిందితులు ఎన్నికల్లో గెలిచి చట్టసభలకు వెళ్లి చట్టాలు చేస్తున్నారని పలువురు వక్తలు ఆరోపించారు. వారికి మనమే అధికారం ఇచ్చి తప్పు చేస్తున్నామని అన్నారు. ఫోరం ఫర్ డెమోక్రసీ అండ్ గ్లోబల్ పీస్ సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటుచేసిన సమావేశంలో సంస్థ అధ్యక్షుడు అనంతుల శ్యామ్‌మోహన్, ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ బండారి కమలాకర్ రావు, కార్యదర్శి శ్రావణ్, కెప్టెన్ పాండురంగారెడ్డి, డాక్టర్ వినోద్‌కుమార్ తదితరులు సమగ్రమైన నైతిక ప్రవర్తనా నియమావళి రూపొందించి అమలు చేయాలని కోరుతూ రాష్ట్రపతి, ఉప రాష్ట్రపతి, ప్రధానమంత్రి, ఎన్నికల సంఘానికి రాసిన లేఖను ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రస్తుతం రాజకీయాల్లో ప్రజాప్రతినిధులు బూతులు ఎక్కువగా మాట్లాడుతున్నారని, దీనివల్ల చాలా మంది సమావేశాలు, చర్చాగోష్ఠులు కుటుంబ సభ్యులతో కలిసి చూడలేకపోతున్నారని అన్నారు. నిందితుడు చట్టసభల్లోకి వెళితే ఐదేళ్ల జీతభత్యాలు, పింఛన్ ఇవ్వకూడదన్నారు. ఎన్నికల్లో ఓటు వేసేటప్పుడే అభ్యర్థుల చరిత్ర తెలుసుకోవాలన్నారు. సమావేశంలో సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

- కీర్తిశేషులు



విజయనిర్మల జయంతి సందర్భంగా నానక్‌రాంగూడలోని విజయకృష్ణ హౌస్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రముఖ హీరో నరేష్, పవిత్రలకు కేక్ తినిపిస్తున్న ఆల్ ఇండియా కృష్ణ, మహేష్ ప్రజాసేన జాతీయ అధ్యక్షులు ఖాదర్ గోరీ, రమణ, పద్మాలయ శర్మ తదితరులు

అత్యాధునిక సదుపాయాలతో ఎస్ టు డెంటల్ కేర్ ఆస్పత్రి



డెంటల్ కేర్ ఆస్పత్రిని ప్రారంభిస్తున్న డాక్టర్ షణ్ముఖరామ్, డాక్టర్ సాహితి

మోతీనగర్, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): ఐదేళ్లుగా దంత వైద్యరంగంలో సేవలందిస్తున్న ఎస్ టు డెంటల్ కేర్ ఆస్పత్రి తాజాగా తమ సేవలను మాదాపూర్‌లో ప్రారంభించింది. ఈ ఆస్పత్రిని మంగళవారం యువ దంత వైద్యులు డాక్టర్ షణ్ముఖరామ్, డాక్టర్ సాహితి దంపతులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలకు నాణ్యమైన దంత వైద్యం అందించడమే తమ లక్ష్య మన్నారు. నూతన భవనంలో అత్యున్నతమైన టెక్నాలజీ సేవలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

ఏఐదే భవిష్యత్



మాట్లాడుతున్న ప్రశాంత్

పటాన్‌చెరు రూరల్, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): భవిష్యత్తు సాంకేతికతలో కృత్రిమ మేధ (ఏఐ) కీలక భూమిక పోషించబోతోందని, విద్యార్థి దశ నుంచే దానిపై పట్టు సాధించాలని నెక్స్ట్ వేవ్ గ్రోత్ మేనేజర్ ప్రశాంత్ ఏఆర్ స్పష్టీకరించారు. గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీలోని కోగాన్ (సాంకేతిక మెళకువలను ప్రోత్సహించే విద్యార్థి విభాగం) మంగళవారం నిర్వహించిన ఒకరోజు 'జనరేటివ్ ఏఐ వర్క్‌షాప్'లో ఆయన ప్రధాన వక్త, శిక్షకుడిగా పాల్గొన్నారు. గీతమ్‌లోని స్టూడెంట్ లెఫ్ట్ అంతర్జాతీయ స్వచ్ఛంద సంస్థ ఏఐఈఎస్ఈసీల సంయుక్త సౌజన్యంతో నిర్వహించిన ఈ కార్యశాలలో వివిధ రంగాల్లో కృత్రిమ మేధ సాధనాలు, వాటి వినియోగంపై సమగ్ర అవగాహన కల్పించేందుకు ప్రయత్నించారు. ఏఐ టూల్స్ ఆచరణాత్మక అభ్యాసం, చాట్‌జీపీటీ వంటి వాటిపై ఆయన గీతం విద్యార్థులకు ప్రాథమిక అవగాహన కల్పించారు.

చిత్తారమ్మ ఆలయాన్ని స్వాధీనం చేసుకోవాలి



ధర్మాదాయా దేవాదాయ శాఖ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

జీడిమెట్ల, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): గాజులరామారం చిత్తారమ్మ ఆలయాన్ని ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ ప్రొటెక్షన్ ఫ్రంట్ అధ్యక్షుడు బోడ రామ్‌చందర్ కోరారు. చిత్తారమ్మ ఆలయాన్ని దేవాదాయ శాఖలో కలవనీయకుండా, కమిటీల పేర్లతో వందల కోట్ల రూపాయాల ఆదాయాన్ని కొల్లగొడుతున్న అంతయ్యగౌడ్, ట్రస్ట్ సభ్యులు, పూజారులపై చట్టపరమైన చర్యలు తీసుకుని, ధర్మాదాయ దేవాదాయ శాఖలో కలపాలని ఆయన మంగళవారం దేవాదాయ ధర్మాదాయ శాఖ కమిషనర్ అనిల్‌కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. గాజులరామారం సర్కిల్‌లో 40ఏళ్ల నుంచి ఉన్న ఈ దేవాలయానికి అంతయ్యగౌడ్ ఆలయ కమిటీ చైర్మన్‌గా కొనసాగుతూ తన అరాచకాలను కొనసాగిస్తున్నాడని పేర్కొన్నారు. ఆలయ హుండీ లెక్కలు తప్పుగా చూపిస్తూ డబ్బు మాయం చేస్తున్నారని ఆరోపించారు. బస్తీవాసులను ఎవరినీ రానివ్వడం లేదని, జాతర సమయంలో వస్తున్న రూ. 5 కోట్లు హుండీ ఆదాయం ఎటువెళ్తుందో అంతయ్యగౌడ్ చెప్పడంలేదని తెలిపారు. తక్షణమే ప్రభుత్వం చిత్తారమ్మ ఆలయాన్ని ధర్మాదాయదేవాదాయ శాఖలో కలిపి స్వాధీనం చేసుకొని, ఆలయాభివృద్ధికి పాటుపడాలని కోరారు.

ఎమ్మెల్యే గాంధీ వ్యాఖ్యలను ఖండిస్తున్నాం



పార్టీ కార్యాలయంలో మాట్లాడుతున్న నాయకులు

వివేకానందనగర్‌కాలనీ, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): జీహెచ్ఎంసీ కౌన్సిల్ సమావేశంలో కాంగ్రెస్ నాయకులు కొత్త బిచ్చగాళ్లు అంటూ ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ చేసిన వ్యాఖ్యలను ఖండిస్తున్నామని కాంగ్రెస్ పార్టీ వివేకానందనగర్ డివిజన్ అధ్యక్షుడు బాషిపాక యాదగిరి, సీనియర్ నాయకులు ఉప్పల ఏకాంత్‌గౌడ్, చిరుమర్తి రాజు, అల్వాల భాస్కర్ అన్నారు. వీవీనగర్‌లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో వారు మంగళవారం విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే గాంధీ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. 10ఏళ్లుగా ఎమ్మెల్యేగా ఉన్న గాంధీ ప్రజా సమస్యలను గాలికొదిలేశారని, అందుకే ఆయనకు వ్యతిరేకంగా గత ఎన్నికల్లో ప్రజలు 1.90లక్షల ఓట్లు ప్రతిపక్ష పార్టీలకు వేశారని గుర్తు చేశారు. నియోజకవర్గంలోని సమస్యలపై స్థానికులు కాంగ్రెస్ నాయకులకు పెద్దఎత్తున వినతిపత్రాలు అందజేస్తున్నారని చెప్పారు. ఇప్పటికైనా ఎమ్మెల్యే తన తీరు మార్చుకోవాలని హెచ్చరించారు.

బాల్యం నుంచే భవిష్యత్ పునాదులు వేసుకోవాలి



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న అతిథులు

ఓల్డుబోయినపల్లి, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): బాల్యం నుంచే భవిష్యత్తుకు పునాదులు వేసుకోవాలని సైబర్ క్రైమ్ ఏసీపీ రాజేశ్ విద్యార్థులకు సూచించారు. అశోకా గార్డెన్‌లో జరిగిన కృష్ణవేణీ టాలెంట్ స్కూల్ 15వార్షికోత్సవ వేడుకలను కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్, స్కూల్ కరస్పాండెంట్ శ్రీనివాస్‌రెడ్డి, ప్రిన్సిపల్ దీపికారెడ్డితో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా చిన్నారులు ప్రదర్శించిన నృత్యాలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. అనంతరం ఏసీపీ రాజేశ్, కార్పొరేటర్ నర్సింహ యాదవ్ చిన్నారులకు బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేసి ఆశీర్వదించారు.

చిన్నదామెర చెరువును పరిశీలించిన కలెక్టర్



చిన్న దామెర చెరువును పరిశీలించి, అధికారులను వివరాలు అడుగుతున్న కలెక్టర్ గౌతంపోట్రు

దుండిగల్, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): దుండిగల్ గ్రామంలోని చిన్న దామెర చెరువును మేడ్చల్ కలెక్టర్ గౌతమ్‌పోట్రు మంగళవారం సందర్శించారు. చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌ల్లో ఎక్కడెక్కడ అక్రమ నిర్మాణాలు వెలిశాయి. ఈ నిర్మాణాలకు ట్యాక్సీలు కడుతున్నారా? లేదా? దానికి మున్సిపల్ అధికారులు 2002-2004 సంవత్సరాల్లో నిర్మాణాలకు వేసిన పన్నులు మాత్రమే వసూళ్లు చేస్తున్నట్టు రెవెన్యూ, మున్సిపల్, ఇరిగేషన్ అధికారులు కలెక్టర్‌కు వివరించారు. చిన్నదామెర చెరువుతో పాటు ప్రగతినగర్‌లోని ఎర్రకుంట చెరువు, గాజులరామారంలోని పరికి చెరువు పూర్తి స్థాయిలో ఆక్రమణలకు గురయ్యాయని, దీనిపై చర్యలు తీసుకుంటారా? అనే విషయమై విలేకరులు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఇక నుంచి అలాంటి వాటికి తావు లేకుండా పరిరక్షస్తామని కలెక్టర్ తెలిపారు. ప్రభుత్వ భూములకు, చెరువులకు సంబంధించి అన్ని శాఖల అధికారులతో బుధవారం కలెక్టర్ కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేస్తామని, వీటిని పరిరక్షిస్తామని కలెక్టర్ అన్నారు.

చిన్నదామెర చెరువులో పార్కింగ్ స్థలాన్ని, బస్సుల కోసం వేసిన రోడ్డును ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌ల్లో మొత్తం తిరిగి పరిశీలించారు. ఈచెరువుకు సంబంధించిన పూర్తి నివేదికను కోర్టుకు సమర్పిస్తామని కలెక్టర్ అన్నారు. కలెక్టర్ సందర్శన సందర్భంగా ఆర్‌డీఓ శ్యామ్ ప్రకాష్, తహసీల్దార్ మతీన్, కమిషనర్ సత్యనారాయణ, ఇరిగేషన్ ఏఈ సారా, సర్వేర్ సునీత ఉన్నారు.



సిరిపురం యాదయ్యకు నివాళి

తెలంగాణ మలిదశ ఉద్యమంలో ప్రాణత్యాగం చేసిన సిరిపురం యాదయ్య వర్ధంతి సందర్భంగా మంగళవారం శేరిలింగంపల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్, నాయకులతో కలిసి యాదయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

- మియాపూర్, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి)

'పెండింగ్ జీతాలు చెల్లించాలి'

బాలానగర్, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): బాలానగర్ డివిజన్ పరిధిలోని అంగన్‌వాడీ టీచర్లు, ఆయాల పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఐలాపురం రాజశేఖర్ అధికారులను కోరారు. ఈసందర్భంగా ఆయన కుత్బుల్లాపూర్ ప్రాజెక్ట్ ఆఫీసర్, సీడీపీవో కార్యాలయానికి వెళ్లి సీనియర్ అసిస్టెంట్ శ్రీకాంత్‌కు వినతిపత్రం అందజేశారు. టీచర్ల వేతనాలు, స్కూలు అద్దెలు, గ్యాస్ బిల్లులు, కూరగాయల బిల్లులు అందక పోవడంతో టీచర్లు ఇబ్బంది పడుతున్నారని వినతిపత్రంలో వివరించారు.

ఏఎంవోహెచ్‌పై చర్యలు తీసుకోవాలి



కుత్బుల్లాపూర్ సర్కిల్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న ఏఐటీయూసీ సభ్యులు, పారిశుధ్య కార్మికులు

కుత్బుల్లాపూర్, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): కుత్బుల్లాపూర్ సర్కిల్ ఏఎంవోహెచ్ డా.భార్గవ్ నారాయణపై శాఖాపరమైన చర్యలు తీసుకొని, పారిశుధ్య కార్మికుల ఆత్మగౌరవాన్ని కాపాడాలని మున్సిపల్ పారిశుధ్య కార్మిక ఏఐటీయూసీ డిమాండ్ చేసింది. మంగళవా రం వారు కుత్బుల్లాపూర్ సర్కి ల్ కార్యాలయంలో పారిశుధ్య కార్మికులతో కలిసి నిరసన తెలిపి, అనంతరం వినతిపత్రం అందజేశారు. సూరారంలోని సాయిబాబానగర్ ప్రభుత్వ పాఠశాల వద్ద మంగళవారం ఉదయం పారిశుధ్య విధులు నిర్వహిస్తున్న సరస్వతీదేవి గ్రూపు కార్మికులైన మంజుల, జ్యోతి, అంజమ్మ మహిళా కార్మికులపై అలాగే నర్సింహులు, వెంకటస్వామి కార్మికులను అసభ్యకర పదజాలంతో దూషిస్తూ పనులు చేయాలని ఇష్టానుసారంగా వ్యవహరించాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈవిషయంపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తే పనిలోంచి తొలగిస్తానని బెదిరించాడని కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై వివరణ కోరగా సదరు గ్రూపునకు చెందిన పారిశుధ్య కార్మికులు ఇదివరకు సుచిత్రా ప్రాంతంలో విధులు నిర్వహించేవారు. వారు విధులు సక్రమంగా నిర్వహించకపోవడంవల్ల ఆయా కాలనీల వారు ఫిర్యాదు చేయడంతో వారిని సూరారంలోని సాయిబాబానగర్ ప్రాంతానికి బదిలీ చేశారు. సదరు బదిలీలను జీర్ణించుకోలేక విధులు సక్రమంగా నిర్వహించాలని తెలపడంతో గతంలో ఓ ఎస్ఎఫ్ఏపైన, ప్రస్తుతం తనపైనా ఇలా లేనిపోనివి సృష్టించి నిరసనలు, ఫిర్యాదులు చేస్తున్నారని ఏఎంవోహెచ్ డా. భార్గవ్ నారాయణ 'ఆంధ్రజ్యోతి'కి వివరించారు. ఫిర్యాదు అందజేసిన వారిలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు కె. స్వామి, ప్రధాన కార్యదర్శి వి.శ్రీనివాసులు, నియోజకవర్గ అధ్యక్షుడు వి.హరినాథ్‌రావు, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

హత్య కేసులో నిందితుడి రిమాండ్

జీడిమెట్ల, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): అప్పు తీర్చమన్నందుకు ఓ వ్యక్తిని దారుణంగా హత్యచేసి సొంత రాష్ట్రానికి పారిపోయిన నిందితుడిని జీడిమెట్ల పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఇందుకు సంబంధించి బాలానగర్ ఏసీపీ హన్మంతరావు, జీడిమెట్ల సీఐ శ్రీనివాసరావు, ఎస్.హరీష్ మంగళవారం విలేకర్ల సమావేశంలో వివరాలు వెల్లడించారు. సుభాష్‌నగర్ ప్రాంతంలోని గంపలబస్తీలో నివాసముండే ఎం.యాసిన్‌బేగ్(48) కొంతకాలం స్థానికంగా పాన్‌షాప్ నిర్వహించేవాడు. కుటుంబ కలహాలతో భార్య పుట్టింటికి వెళ్లిపోవడంతో అప్పుల పాలైన యాసిన్‌బేగ్ పాన్‌షాపు అమ్మేసి కూలిపనికి వెళ్తున్నాడు. తన గదిని సుభాష్‌నగర్‌కు మార్చాడు. ఈక్రమంలో కలకత్తాకు చెందిన ఫేకుఖాన్ (27)తో ఇతడికి సహవాసం ఏర్పడింది. నిత్యం మద్యం తాగేవారు. ఈ క్రమంలో ఫేకుఖాన్ తన అవసరాల కోసం యాసిన్‌బేగ్ నుంచి అప్పుగా డబ్బు తీసుకున్నా డు. డబ్బులు ఇవ్వమని అడగటంతో ఇద్దరిమధ్య గొడవ జరిగింది. ఈనెల 8న రాత్రి మద్యం మత్తులో ఫేకుఖాన్ బ్లేడ్‌తో యాసిన్‌బేగ్‌ను దారుణంగా హత్యచేసి సొంత రాష్ట్రానికి పారిపోయాడు. జీడిమెట్ల పోలీసులు కేసు నమోదు చేసి నిందితుడిని ఈనెల 16న అదుపులోకి తీసుకుని విచారించి మంగళవారం రిమాండ్‌కు తరలించారు.

సమన్వయంతోనే మానవ అక్రమ రవాణాకు అడ్డుకట్ట

హైదరాబాద్, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): శాఖల మధ్య సమన్వయంతోనే మానవ అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయవచ్చని వక్తలు అభిప్రాయ పడ్డారు. మహిళా భద్రత విభాగం ఆధ్వర్యంలో 'మానవ అక్రమ రవాణా నిరోధం, తప్పిపోయిన వారిని గుర్తించడం' అనే అంశంపై మంగళవారం హైదరాబాద్‌లోని ఓ హోటల్‌లో వర్క్‌షాప్ నిర్వహించారు. రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్, గవర్నమెంట్ రైల్వే పోలీస్, యూఎస్ కాన్సులేట్, బచ్‌పన్ బచావో ఆందోళన్ ప్రతినిధులు పాల్గొన్నారు. అదనపు డీజీపీ (రోడ్డు భద్రత) మహేష్ భగవత్ మాట్లాడుతూ మానవ అక్రమ రవాణా ముఠాలు ఎలా పనిచేస్తాయి, కట్టడిలో దర్యాప్తు సంస్థలకు ఎదరయ్యే సవాళ్లు, ఇతర అంశాలపై వివరించారు. మానవ అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయడంలో తెలంగాణ మహిళా భద్రత విభాగం అనుసరిస్తున్న విధానాల్ని యూఎస్ కాన్సులేట్ జనరల్ జెన్నిఫర్ లారెన్స్ అభినందించారు. ఈ సందర్భంగా మానవ అక్రమ రవాణా, తప్పిపోయిన వారిని గుర్తించేందుకు కొంతకాలంగా మహిళా భద్రత విభాగం చేపట్టిన, కొనసాగిస్తున్న అంశాల్ని ఆ విభాగం డీఐజీ రేమా రాజేశ్వరి వెల్లడించారు. మానవ అక్రమ రవాణా కట్టడి, తప్పిపోయిన వారిని గుర్తించేందుకు ఆయా విభాగాలు అనుసరించాల్సిన విధానాలపై ఎస్ఓపీ (స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్స్), టెక్నాలజీ వాడకం తదితర అంశాలపై వర్క్‌షాప్‌లో చర్చించారు.

మీది మొత్తం వెయ్యి అయ్యింది

- యూజర్ చార్జీలు అదనం
- హైదరాబాద్ సిటీ పోలీసుల ట్వీట్ వైరల్



హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): 'మీది మొత్తం వెయ్యి అయ్యింది.. యూజర్ చార్జీలు అదనం' అంటూ హెల్మెట్ లేకుండా ఫోన్ మాట్లాడుతూ బైక్ నడుపుతున్న వ్యక్తి ఫొటోను షేర్ చేస్తూ హైదరాబాద్ సిటీ పోలీసుల ట్వీట్ నెట్టింట వైరల్ అయ్యింది. ఇటీవల రోడ్డు పక్కన భోజనం అమ్మే కుమారీ అంటీకి సోషల్ మీడియాలో ఫుల్ ఫాలోయింగ్ ఉంది. 'మీది మొత్తం వెయ్యి అయ్యింది. రెండు లివర్లు ఎక్స్ ట్రా' అనే డైలాగ్ సోషల్ మీడియాలో కుదిపేసింది. తాజాగా 'మీది మొత్తం వెయ్యి అయ్యింది' అనే ఆమె ఫేమస్ డైలాగ్ హైదరాబాద్ పోలీసులు ఉపయోగిస్తూ ట్వీట్ చేయడం ఇప్పుడు వైరల్‌గా మారింది.

వైభవంగా సమతాకుంభ్ ప్రారంభం

- భక్తులకు మంగళశాసనాలు అందజేసిన చిన జీయర్‌స్వామి
- మార్చి 1 వరకు బ్రహ్మోత్సవాలు

శంషాబాద్ రూరల్, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండల పరిధి ముచ్చింతల్‌లోని సమతామూర్తి స్ఫూర్తి కేంద్రంలో సమతాకుంభ్ - 2024 ద్వితీయ బ్రహ్మోత్సవాలు మంగళవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆధ్యాత్మిక గురువు త్రిదండి రామానుజ చిన జీయర్‌స్వామి పర్యవేక్షణలో బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఉదయం అర్ఘ్యాభిషేకం ఘనంగా జరిగింది. సువర్ణమూర్తి భగవత్ రామానుజస్వామికి ఉత్సవారంభ స్నపనం నిర్వహించారు. ఆరుద్ర అనేది రామానుజుల అవతార నక్షత్రం అని, ఈ క్షేత్రానికి అధిష్ఠాన దేవుడు శ్రీరామచంద్రుడని, ప్రతీ ఆరుద్ర నక్షత్రం నుంచి చిత్త నక్షత్రం వరకు ఈ బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తామని చినజీయర్ స్వామి తెలిపారు. కాగా 108 దివ్య దేశాల భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా చిన జీయర్‌స్వామి భక్తులనుద్దేశించి మాట్లాడారు. అయోధ్య రాముడు మాత్రం పుర్వసు నక్షత్రంలో జన్మించాడన్నారు. తిరునక్షత్ర ప్రయుక్త తిరుమంజనంతో శుభారంభం జరుగుతోందని ఆయన తెలిపారు. శ్రీరామానుజుల వారికి అలంకరణ చేసి అష్టోత్తర శతనామ అర్చనజరిపించామన్నారు. మొదటి రోజు వేలాదిమంది భక్తులు తరలివచ్చారు. నగరంతో పాటు రాష్ట్ర నలుమూలల నుంచి, ఏపీ, కర్ణాటక, మహారాష్ట్రల భక్తులు వేలాదిగా వచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. చివరగా భక్తులకు చిన జీయర్‌స్వామి మంగళా శాసనాలు అందజేశారు. మరో వారం పాటు జరిగే బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశామని ఈ సందర్భంగా స్వామిజీ తెలిపారు. బ్రహ్మోత్సవాల్లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు పాల్గొంటారని స్వామిజీ తెలిపారు. కార్యక్రమంలో అహోబిల జీయర్‌స్వామి, దేవనాథ జీయర్ స్వామి పాల్గొన్నారు.





సువర్ణ భగవత్ రామానుజస్వామికి అభిషేకం నిర్వహిస్తున్న అర్చకులు, ప్రసంగిస్తున్న చినజీయర్ స్వామి

'నిధులు మంజూరు చేయాలి'

హైదర్‌నగర్, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): జీహెచ్ఎంసీ కౌన్సిల్ హాల్‌లో మంగళవారం జరిగిన బల్దియా సమావేశంలో హైదర్‌నగర్ కార్పొరేటర్ నార్నె శ్రీనివాస్‌రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన డివిజన్ పరిధిలోని అడ్డగుట్టసొసైటీలో నిర్మించిన మల్టీపర్పస్ ఫంక్షన్‌హాల్ ప్రారంభానికి చర్యలు తీసుకోవాలని, డివిజన్‌లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని మేయర్ దృష్టికి తీసుకెళ్లారు.

ఆలయ వార్షికోత్సవం

కూకట్‌పల్లి, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): కూకట్‌పల్లి డివిజన్ పరిధి పాపిరెడ్డినగర్‌లోని వీరాంజనేయ శివాలయ దేవస్థానం 17వ వార్షికోత్సవ వేడుకలు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఈసందర్భంగా ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజలు, అభిషేక కార్యక్రమాల్లో ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ, నాయకులు సంజీవరెడ్డి, శ్రీనివాస్‌యాదవ్, భాస్కర్‌రావు, చంద్రారెడ్డి, రాజేశ్వర్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, ధర్మారావు, భగవంతురెడ్డి పాల్గొన్నారు.

బాలుడి అదృశ్యం

చందానగర్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): ఇంటి నుంచి బయటకెళ్లిన 9వ తరగతి బాలుడు అదృశ్యమయ్యాడు. ఈఘటన చందానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. వెంకటరెడ్డినగర్‌లో నివాసముంటున్న ఎల్లయ్య కుమారుడు సాత్విక్(14) లింగంపల్లిలోని ఓ ప్రైవేట్ స్కూల్‌లో 9వ తరగతి చదువుతున్నాడు. ఈనెల 19న సాయంత్రం ఎవరికీ చెప్పకుండా ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. పరిసర ప్రాంతాలు, స్నేహితులను విచారించినా ఆచూకీ తెలియకపోవడంతో కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ రమేష్ తెలిపారు.

ఆక్రమణల తొలగింపు

బాలానగర్/ పేట్‌బషీరాబాద్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): రోడ్డును ఆక్రమించి వ్యాపారం చేస్తున్న దుకాణాలను కుత్బుల్లాపూర్ టౌన్ ప్లానింగ్ అధికారులు మంగళవారం తొలగించారు. టౌన్ ప్లానింగ్ ఏసీపీ సాయిబాబ, సెక్షన్ ఆఫీసర్ ప్రభావతి, బాలానగర్ లా అండ్ ఆర్డర్, ట్రాఫిక్ పోలీసుల పర్యవేక్షణలో ఆక్రమణల తొలగింపులు చేపట్టారు. ఐడీపీఎల్ టౌన్‌షిప్ ఎదురుగా ఉన్న ఆదర్శనగర్ నుంచి సోమవారం ఆక్రమణల తొలగింపు చేపట్టగా రెండో రోజు సుమారు 30 నుంచి 40 ఆక్రమణలు తొలగించినట్టు అధికారులు వివరించారు.

'నియోజకవర్గ అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం'

మియాపూర్, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వానికి జీహెచ్ఎంసీ, శేరిలింగంపల్లి నియోజకవర్గ అభివృద్ధిపై స్పష్టమైన అవగాహన ఉందని మంత్రి శ్రీధర్‌బాబు ఆదేశాల మేరకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని కార్పొరేట ర్, కాంగ్రెస్ పార్టీ శేరిలింగంపల్లి ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్ అన్నారు. మంగళవారం జీహెచ్ఎంసీ కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ శేరిలింగంపల్లి నియోజకవర్గంలో అన్యాక్రాంతం అవుతున్న పార్కు స్థలాలు కాపాడే బాధ్యత మేయర్, కమిషనర్ తీసుకోవాలని కోరారు. చందానగర్ పీజేఆర్ స్టేడియంలో క్రీడాకారులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడాలని, ఇప్పటికే వారి సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొచ్చామని, ఇప్పటికైనా స్పందించి సమస్యలు పరిష్కరించాలని మేయర్‌ను ఆయన కోరారు.

యువకుడి మృతి

పేట్‌బషీరాబాద్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనం అదుపు తప్పి కిందపడడంతో తీవ్ర గాయాలపాలైన యువకుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. మెదక్ జిల్లా, తూప్రాన్ గ్రామానికి చెందిన అర్కాల వంశీ(25)వ్యవసాయం చేసుకుంటూ ఉంటాడు. హైదరాబాద్‌కు పని నిమిత్తం వచ్చి తిరుగు ప్రయాణంలో ఈ నెల 18న రాత్రి (ఏపీ10ఏసీ7929) ద్విచక్ర వాహనంపై కొంపల్లి నుంచి తూప్రాన్‌కు వెళ్తుండగా జీవీకే సమీపంలో రోడ్డుపై ద్విచక్ర వాహనం అదుపు తప్పి కిందపడగా, తలకు తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు సమీపంలోని ఆస్పత్రికి తరలించారు. అప్పటి నుంచి చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని పేట్‌బషీరాబాద్ ఎస్ఐ ప్రవీణ్ తెలిపారు.

షెటిల్ కోర్టు ప్రారంభం

పేట్‌బషీరాబాద్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): జీడిమెట్ల డివిజన్ బృందావనం కాలనీలో సమస్యలపై బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా కార్యదర్శి చెరుకుపల్లి భరత్‌సింహారెడ్డి మంగళవారం పర్యటించారు. ఈసందర్భంగా స్థానికులు పార్కును అభివృద్ధి చేయాలని బోరు వేయించాలని ఆయన దృష్టికి తీసుకొచ్చారు. కాలనీలో ఏర్పాటు చేసుకున్న షెటిల్ కోర్టును ఆయన ప్రారంభించారు.